→RNI No : APTEL/26/A3646←

ఆంధ్రప్రదేశ్

# గాయత్రి న్యూస్

ప్రచురణ : గుంటూరు జిల్లా - ఆంధ్రప్రదేశ్: శుక్రవారం 04-09-2026 సంపుటి : 1 సంచిక :101 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 8 వెల రు :2/-






## పదేళ్ల కిందటే మోదీ ఏఐ గురించి మాట్లాడారు: ఎన్విడియా సీఈవో

ప్రధాని నరేంద్ర మోదీ దశాబ్దం క్రితమే దూరదృష్టితో ఆలోచించి ఏఐ గురించి మాట్లాడారని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అన్నారు. ప్రపంచ ఐటీ రంగంలో భారత్ తిరుగులేని శక్తిగా ఎదిగిందని.. ఇప్పుడు ఏఐ రూపంలో కొత్త టెక్నాలజీ వైపు దూసుకుపోతోందన్నారు.

2 లో



## నల్సార్ విద్యార్థులకు ఊరట.. బార్ కౌన్సిల్‌పై 'సుప్రీం' ఆగ్రహం

నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ ఆదేశాలను బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్రా వెంటనే వెనక్కి తీసుకున్నా ప్రయోజనం లేకపోయింది.

పేజి 2లో ▶

## అయోధ్య రామాలయ ట్రస్ట్ తొలి సీఈవోగా ఎయిర్ మార్షల్(రిటైర్డ్) జితేంద్ర మిశ్ర



2 లో

- ఆపరేషన్ సిందూర్‌లో వెస్టన్ ఎయిర్ కమాండ్‌కు నేతృత్వం వహించిన ఐఏఎఫ్ సీనియర్ అధికారి

- 5,585 దరఖాస్తులను వడగట్టి ఎంపిక

అయోధ్య: భారత వాయుసేన (ఐఏఎఫ్) మాజీ ఉన్నతాధికారి, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి సీఈవోగా బుధవారం నియమితులయ్యారు.

## సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం..

### అందుకు తగ్గట్టుగా సిద్ధమవ్వాలి: సీఎం



పేజి 2లో ▶

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం ముగిసింది. ప్రధానంగా ఎల్‌నినోపైనే కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. మైనస్ 52 శాతంలో వర్షాలు నమోదయ్యాయని.. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని, సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది.**

పశుగ్రాసంపై దృష్టి పెట్టాలని కోరింది. కరవు పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి ఏ విధంగా నిధులు రాబట్టాలనే అంశంపైనా మంత్రివర్గంలో చర్చించినట్లు తెలుస్తోంది.వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వడంపై ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. సీఎం కేబినెట్‌లోకి రాగానే అందరూ లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. మంత్రులందరూ ప్రజలలోకి వెళ్లాలని చెప్పారు. 'మనం ఇన్ని పనులు చేస్తున్నాం.. వీటన్నింటినీ ప్రజలకు చెప్పుకోవాలి.

## కొత్త పింఛన్లు, స్థానిక ఎన్నికలు.. మంత్రులతో లోకేశ్ కీలక చర్చ



**విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కుట్రల్ని ధీటుగా తిప్పికొట్టాలని మంత్రి అన్నారు. మాట వినని అధికారుల్ని ఉపేక్షించేది లేదన్నారు. కొందరు అధికారుల పనితీరు శాఖకు, మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు.**

తెలుగుదేశం మంత్రులతో మంత్రి నారా లోకేశ్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. కొత్త పింఛన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధానంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశల వారీగా కొత్త ఫింఛన్లు ఇవ్వాలని మంత్రి లోకేశ్ అన్నారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ కొత్త ఫించన్లు ఇవ్వాలని మంత్రులకు తెలిపారు. అలాగే, స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమవ్వాలని.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. అక్టోబర్‌లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని..ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు: కొండా సురేఖ



## మళ్లీ వీవీఎస్ లక్ష్మణ్‌కే అవకాశం.. కేంద్రం ఆమోదం



మరో రెండు వారాల్లో మొదలయ్యే ఆసియా క్రీడల్లో టీమ్‌ఇండియా తలపడనున్న సంగతి తెలిసిందే. నేరుగా క్వార్టర్ ఫైనల్‌లో తలపడనుంది. జపాన్ వేదికగా ఈ క్రీడలు జరగనున్నాయి. అయితే, భారత జట్టుతోపాటు కోచ్‌గా వెళ్లేందుకు వీవీఎస్ లక్ష్మణ్‌కు మళ్లీ అవకాశం వచ్చింది.

## 26 నెలల్లో పూర్తిచేశాం



2 లో

వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిన పోలవరం ఎడమ కాలువ పనులను కూటమి సర్కారు 26 నెలల్లోనే పూర్తిచేసింది. 213 కిలోమీటర్ల పొడవున్న పోలవరం ఎడమ కాలువ... ఏలేరు, పంపా, తాండవ, వరహా నదులను దాటుకుంటూ కాకినాడ, అనకాపల్లి జిల్లాల వ్యవసాయ అవసరాలను తీర్చటమే కాకుండా విశాఖపట్నం నగర ప్రజల తాగునీటి భద్రతకు బలమైన ఆధారంగా నిలవనుంది.

## క్రెడిట్ చోరీ వ్యాధికి మొదటి రోగి జగన్

### - మంత్రి గుమ్మడి సంధ్యారాణి



వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గొడ్డలి పార్టీ అధినేత జగన్‌కు క్రెడిట్ చోరీ వ్యాధి బాగా ముదిరిపోయిందని.. వైద్యుడు కూడా లేని ఇలాంటి వ్యాధికి మొదటి రోగి జగనే అంటూ ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేసినా, ఉదయం అవినీతి జరిగిందని... సాయంత్రం తన ఘనతని చెప్పుకుంటున్నారంటూ జగన్‌పై విరుచుకుపడ్డారు.

## మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయండి.. గవర్నర్‌కు సీఎం లేఖ

**తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది.**

**ఈ మేరకు హైకమాండ్ నిర్ణయం తీసుకుంది.**

**క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు లేఖ పంపారు.**

**ఆమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం కోరారు. రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.**



పేజి 2లో ▶

సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె తన వివరణ పంపారు. కుమార్తె వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. వాటితో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కోరారు. మరోవైపు వనపర్తి వ్యవహారంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి.

## శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో శాస్త్రవేత్తల బృందం



2 లో

శ్రీవారిని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్, శాస్త్రవేత్తలు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని దర్శించుకుని, స్వామి పాదాల వద్ద జీఎస్ఎల్‌వీ ఎఫ్-17 రాకెట్, ఈఓఎస్-05 శాటిలైట్ నమూనాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సంపాదకీయం

## జెన్‌జీని మోదీ జయించగలరా?

‘నిలదొక్కుకోవాలంటే తడబడడం అవసరం’ అని ఒక కవి అన్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అదే దారిలో ఉన్నట్లు కనిపిస్తోంది. జూలై 20--25 తేదీల మధ్య దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను బుట్టదాఖలు చేయాలని, తదుపరి దర్యాప్తులు చేయరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించడంతో... దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో సెప్టెంబర్ 5న పెల్లుబుకాల్సిన మరో అల్లకల్లోలం సమసిపోయినట్లేనని భావించవచ్చు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగాల్సిన బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో మరోసారి శాంతిభద్రతల సమస్య తలెత్తవచ్చునని కేంద్రం భావించినందువల్లే సామరస్య వైఖరిని అవలంబించక తప్పలేదని స్పష్టమవుతోంది. ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేస్తామని, నీట్ పేపర్ లీక్‌లతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని సీజేపీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుని నెల రోజులు దాటింది. అయితే కేంద్రం ఎంతకూ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల దినోత్సవం రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు హెడ్ క్వార్టర్స్ దాకా నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని సీజేపీ ప్రకటించింది. దీంతో న్యూఢిల్లీలో పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద అనుమతిలేని అన్ని సమావేశాలను పూర్తిగా నిషేధించారు. ఈ నిరసన ప్రదర్శనపై నిషేధం విధించాలని ఒక రిటైర్డ్ పోలీసు అధికారి ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయించారు.సాధారణంగా అయితే పెద్ద ఎత్తున బలగాలను తరలించి, న్యూఢిల్లీని యుద్ధ క్షేత్రంగా మార్చి, ఇంటర్నెట్ సదుపాయాలను నిలిపివేసి, విద్యార్థుల ప్రదర్శనను తొక్కివేయగల శక్తి మోదీ సర్కార్‌కు ఉన్నది. విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత కూడా వారిని డిజిటల్ ఆధారాలతో గుర్తించి వేధించడం కేంద్రం సహజ వైఖరికి నిదర్శనం. ఆ సమయంలో పెల్లెట్ల ప్రయోగం, ఇతర దారుణాలపై అనేక సంస్థలు కోర్టుకు వెళ్లడంతో ఉన్నత స్థాయి కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. అయినప్పటికీ విద్యార్థులు ప్రభుత్వ నిజాయితీని శంకించవలసిన పరిస్థితులు తలెత్తాయి. అయితే ఒక అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు సమయంలో పోలీసులు స్వైర విహారం, హింసాకాండ మూలంగా విదేశీ ప్రతినిధులకు అసౌకర్యం కలిగించడమే కాక, అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న ఆందోళనతో ప్రభుత్వం పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించక తప్పలేదు. నిరసన ప్రదర్శనను తాము నిషేధించే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన మర్నాడే విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేయాలని కేంద్రం, ఢిల్లీ పోలీసులు దరఖాస్తులు పెట్టుకున్నారు. విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలలలోగా నష్టపరిహారం చెల్లిస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అసాధారణ ప్రత్యేకాధికారాలను ఉపయోగించుకుని విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం, తాము నిరసన ప్రదర్శనను ఉపసంహరించుకుంటున్నామని సీజేపీ ప్రతినిధులు ప్రకటించడంతో పరిస్థితులు సద్దుమణిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ పరిణామాలతో జూన్--జూలై నెలల్లో జరిగిన విద్యార్థుల నిరసన ప్రదర్శనల ప్రకంపనలు దేశంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని అర్థమవుతోంది. ఢిల్లీలో జరిపిన నిరసన ప్రదర్శనలతో ఆగకుండా సీజేపీ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రజా సమస్యలపై ఆందోళనలకు ఉపక్రమించింది. ప్రభుత్వ విధానాల సమీక్ష, స్కూళ్లలో మౌలిక సదుపాయాల పరిస్థితులు, ప్రశ్నపత్రాల లీక్ సమస్యలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, టీచర్ల పోస్టుల ఖాళీలు, నిరుద్యోగం, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటి సమస్యలపై మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, ఢిల్లీలలో ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న స్కూళ్లకు వెళ్లి ‘స్కూల్ ఠీక్ కరో’ ఉద్యమాన్ని ప్రారంభించారు. జాతీయ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసి ‘క్యాబోల్తీ హై పబ్లిక్’ పేరుతో దేశవ్యాప్త పర్యటనలు ప్రారంభించడంతో సీజేపీకి ఏదో బృహత్తర లక్ష్యం ఉన్నట్లు భావించక తప్పడం లేదు.సీజేపీ లక్ష్యం ఏదైనా, దాని భవిష్యత్తు ఎలా ఉన్నప్పటికీ, తీవ్ర ఒత్తిడి వస్తే తప్ప తన వైఖరి మార్చుకునే ధోరణి కేంద్రంలో కనపడకపోవడం సాధారణంగా మారింది. విద్యార్థుల ఆందోళన తారస్థాయికి చేరుకున్న తర్వాతే విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. ఇప్పుడు ఇండియాగేట్ నుంచి ర్యాలీ చేస్తామని హెచ్చరించిన తర్వాతగానీ విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం దిగిరాలేదు. ఎందుకు ప్రతి సమస్యనూ తెగేదాకా లాగి ఆ తర్వాత వెనక్కి తగ్గడం? ప్రతిసారీ ప్రభుత్వ పరువును కాపాడేందుకు సర్వోన్నత న్యాయస్థానం ముందుకురాలేదు కదా! దాని పరిమితులు దానికి ఉన్నాయి. ఎందుకో సమస్యలను పరిష్కరించడంలో, లేదా అంచనా వేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమవుతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. సమస్యలను పరిష్కరించేందుకు ఒక మేధో యంత్రాంగాన్ని రూపొందించుకోలేకపోవడం, కేవలం బల ప్రయోగాన్నే నమ్ముకోవడమే ఇందుకు కారణం కావచ్చన్న అభిప్రాయం కలుగుతోంది.

పన్నెండు సంవత్సరాల పరిపాలన తర్వాత దేశంలో చెప్పుకోదగ్గ స్థాయిలో, అది కూడా విద్యార్థుల నుంచి మోదీ సర్కార్ ఎందుకు ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తోంది? కొత్త తరం ఇప్పుడు ప్రతి నిర్ణయాన్నీ ప్రశ్నిస్తోంది. వ్యవస్థల్లో లోపాల్ని ఎత్తిచూపుతోంది. వారికి మద్దతుగా కాంగ్రెస్‌తో పాటు ఇతరేతర శక్తులు కూడా తోడవుతున్నాయి. అంతమయ్యాయనుకున్న రకరకాల వామపక్షాలు కూడా ఇప్పుడు అత్యుత్సాహంతో తమ వంతు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. సోషల్ మీడియా ఉపయోగంలో ఈ అన్ని శక్తులూ కలిసికట్టుగా విజృంభిస్తున్నాయి. ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాల నేతలే కాదు, బిహార్‌లో తన ఉనికి కోసం పోరాడుతున్న సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) వంటి పార్టీ కూడా తమ విద్యార్థి సంఘం నాయకురాలు నేహా బోరా ద్వారా జరుగుతున్న పరిణామాలను, బీజేపీని ఎండగట్టేందుకు ఉపయోగించుకుంటున్నదంటే అన్ని వామపక్ష శక్తులూ ఎలా సంఘటితమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఈ శక్తులు ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అవి విజయం సాధించగలవా అన్నది చెప్పలేము కానీ కమలనాథులు మాత్రం ఆత్మరక్షణలో పడ్డారనడంలో సందేహం లేదు.రాజకీయ పార్టీల దృక్కోణాల్లోంచి కొత్త తరం దేశాన్ని చూడడం లేదు. కులం, మతం, ప్రాంతం, చివరకు లింగం వంటి సంప్రదాయ గుర్తింపులను కూడా ఈ తరం అధిగమించి ఒక ప్రత్యేక గుర్తింపుతో ముందుకు వచ్చిందనడంలో సందేహం లేదు. చాలా మంది సంప్రదాయ రాజకీయ నాయకులకు వారి ప్రవర్తన, భాష, జీవన శైలి, ఆందోళనలు అర్థం కావడం లేదు. ఆ నవ యువత గురించి తమ సొంత దృక్పథంలో ఆలోచించి, అవే కళ్లద్దాలతో వారిని చూడడం ప్రారంభించారు. వారిని ఆకర్షించేందుకు దయనీయ ప్రయత్నాలు చేస్తున్నారు. తమను తాము హాస్యాస్పదులుగా నిరూపించుకుంటున్నారు. ఈ ప్రయత్నాలు మానేసి నవ తరం లేవనెత్తుతున్న అంశాలను, ఆందోళనలను అర్థం చేసుకోవాల్సి ఉన్నది. విద్య, నిరుద్యోగం, జవాబుదారీ విధానం, వ్యవస్థలు తమ పనిని తాము చేయడం, అవినీతిని నిర్మూలించడం, పారదర్శకత, నిజాయితీని వారు ఆశిస్తున్నారు. ఆర్థిక సంస్కరణలు అమలు అయిన తర్వాత ఎన్నో సంవత్సరాలకు వారు జన్మించారు. వివిధ ప్రపంచ దేశాల పరిస్థితుల గురించి తెలిసినవారు. ఎంతసేపూ మత రాజకీయాలు, కాంగ్రెస్ పాలనలో అమలు అయిన దుర్మార్గాల గురించి మాట్లాడడం వారికి నచ్చకపోవచ్చు. నెహ్రూ, ఇందిరలు కాదు కదా, రాజీవ్‌గాంధీని సైతం వారు చూడలేదు. నరేంద్ర మోదీ మాత్రమే వారికి సుపరిచిత దేశ పాలకుడు, జాతీయ నాయకుడు. అందువల్ల వారి భవిష్యత్తును మెరుగుపరిచేందుకు ఏమి చేయాలన్నదే ప్రస్తుత పాలకుల కర్తవ్యం.

కొత్త తరం యువతను ఆకర్షించేందుకు రాజీవ్‌గాంధీ 1988లో 18 ఏళ్ల వయస్సు వారికి ఓటు హక్కు కల్పించారు. 40 ఏళ్ల వయస్సులోనే ప్రధాని అయిన రాజీవ్ తనను తాను నవయువకుడుగా భావించుకున్నప్పటికీ 1989 ఎన్నికల్లో నాటి యువతరం ఆయన ప్రభుత్వాన్ని గద్దె దించింది. బోఫోర్స్ కుంభకోణం, పెచ్చరిల్లిన ద్రవ్యోల్బణం, పెరిగిన నిరుద్యోగం, పత్రికా స్వేచ్ఛను నియంత్రించే ప్రయత్నాలు. షాబానో కేసు ద్వారా ప్రజలను మతపరంగా విడదీసేందుకు అనుసరించిన విధానాలే అందుకు కారణాలు. రాజీవ్‌గాంధీ విఫలమైన చోట మోదీ విజయం సాధించాలంటే యువతరం మనసును ఆకట్టుకోవాలి. అందుకు మారుతున్న దేశ కాలమాన పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఎంతసేపూ కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ఆ పార్టీ దుర్లక్షణాలన్నీ అలవరుచుకుని, ఆ కాలంలో జరిగిన పాపాలన్నిటినీ రెట్టింపు తీవ్రతతో పునరావృతం చేస్తుంటే జనం ప్రశ్నించకుండా ఉంటారా?

# 26 నెలల్లో పూర్తిచేశాం

మొదటిపేజీ తరువాయి

వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిన పోలవరం ఎడమ కాలువ పనులను కూటమి సర్కారు 26 నెలల్లోనే పూర్తిచేసింది. 213 కిలోమీటర్ల పొడవున్న పోలవరం ఎడమ కాలువ... ఏలేరు, పంపా, తాండవ, వరహా నదులను దాటుకుంటూ కాకినాడ, అనకాపల్లి జిల్లాల వ్యవసాయ అవసరాలను తీర్చటమే కాకుండా విశాఖపట్నం నగర ప్రజల తాగునీటి భద్రతకు బలమైన ఆధారంగా నిలవనుంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్షలకు సజీవరూపంగా ఏలేరు, పంపా ఆయకట్టును స్థిరీకరిస్తూ పోలవరం ఎడమ కాలువ నుంచి గోదారమ్మ పరుగులు తీస్తున్న శుభతరుణాన ఈ ప్రజాకార్యం సాకారం కావడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు. ప్రతి నీటిబొట్టునూ సద్వినియోగం చేసుకోవాలనే దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఆ సంకల్పానికి పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీటి విడుదల కార్యక్రమమే నిదర్శనం. ఉత్తరాంధ్ర జీవనాడి లాంటి ఈ కాలువ నిర్మాణపనులు వేగంగా పూర్తయ్యేందుకు కృషిచేసిన మంత్రి రామానాయుడు, లబ్ధి పొందనున్న రైతులు, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

# శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో శాస్త్రవేత్తల బృందం

మొదటిపేజీ తరువాయి

శ్రీవారిని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్, శాస్త్రవేత్తలు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని దర్శించుకుని, స్వామి పాదాల వద్ద జీఎస్ఎల్‌వీ ఎఫ్–17 రాకెట్, ఈఓఎస్–05 శాటిలైట్ నమూనాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈఓఎస్–05 ప్రయోగానికి కౌంట్‌డౌన్ సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: జీఎస్ఎల్‌వీ– ఎఫ్17 వాహననౌక ద్వారా ఈఓఎస్–05 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు కౌంట్‌డౌన్ ప్రక్రియ బుధవారం రాత్రి 11:25 గంటలకు ప్రారంభం కానుంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2:55 గంటలకు ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయోగం విజయవంతం కావాలని ఇస్రో ఛైర్మన్ డా.వి.నారాయణన్ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం.. అందుకు తగ్గట్టుగా సిద్ధమవ్వాలి: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి



అమరావతి, సెప్టెంబర్ 3: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం ముగిసింది. ప్రధానంగా ఎల్‌నినోపైనే కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. మైనస్ 52 శాతంలో వర్షాలు నమోదయ్యాయని.. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని, సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది. పశుగ్రాసంపై దృష్టి పెట్టాలని కోరింది. కరవు పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి ఏ విధంగా నిధులు రాబట్టాలనే అంశంపైనా మంత్రివర్గంలో చర్చించినట్లు తెలుస్తోంది.వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వడంపై ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. సీఎం కేబినెట్‌లోకి రాగానే అందరూ లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. మంత్రులందరూ ప్రజలలోకి వెళ్లాలని చెప్పారు. ‘మనం ఇన్ని పనులు చేస్తున్నాం.. వీటన్నింటినీ ప్రజలకు చెప్పుకోవాలి. కొత్త జనరేషన్ జెన్ జీ అన్ని విషయాలపై అవగాహనతో ఉంది. వాళ్లు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉన్నారు. మనం కూడా అందుకు తగినట్టుగా సిద్ధమవ్వాలి. మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాలి’ అని సూచించారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులతో చంద్రబాబు అన్నారు. తప్పుడు, ఫేక్ ప్రచారాలు చేయడంలో వైసీపీ ముందు ఉంటుందని విమర్శించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై కూడా వైసీపీ సిగ్గు లేకుండా దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్ట్ పూర్తైనా అది కూటమి ప్రభుత్వం చేసిందే అని.. ఈ విషయం ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను కూడా అదుపు చేయాలన్నారు. దీనిపై ఉన్న కేబినెట్ సబ్ కమిటీ ధరలపై జాగ్రత్తగా ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు ధరల పెరుగుదలపై దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు కోరారు.

# పదేళ్ల కిందటే మోదీ ఏఐ గురించి మాట్లాడారు: ఎన్విడియా సీఈవో

మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ దశాబ్దం క్రితమే దూరదృష్టితో ఆలోచించి ఏఐ గురించి మాట్లాడారని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అన్నారు. ప్రపంచ ఐటీ రంగంలో భారత్ తిరుగులేని శక్తిగా ఎదిగిందని.. ఇప్పుడు ఏఐ రూపంలో కొత్త టెక్నాలజీ వైపు దూసుకుపోతోందన్నారు. భారతీయ కంపెనీలు, స్టార్టప్‌లు ఏఐ సాంకేతికతను మరింతగా అందిపుచ్చుకోవడంతోపాటు.. దాని అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. బలమైన ఏఐ ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు భారత్‌కు చాలా మంచి అవకాశాలు ఉన్నాయని హువాంగ్ తెలిపారు. నార్త్ కరోలినాలోని చాపెల్ హిల్‌లో జీ20 ఇన్నోవేషన్ మినిస్టీరియల్ సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఏఐ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని.. అందుకనుగుణంగా దేశాలు మరింత వేగంగా ముందుకు సాగాలని హువాంగ్ సూచించారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ.. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. హువాంగ్ 2023లో భారత్‌లో పర్యటించినప్పుడూ ప్రపంచంలో ఇండియా అతిపెద్ద ఏఐ హబ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

# నల్సార్ విద్యార్థులకు ఊరట.. బార్ కౌన్సిల్‌పై ‘సుప్రీం’ ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ ఆదేశాలను బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర వెంటనే వెనక్కి తీసుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఈ అంశాన్ని సీరియస్ తీసుకున్న సుప్రీంకోర్టు గురువారం జరిగిన విచారణలో బీసీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టబద్ధ అధికారం లేదని స్పష్టం చేసింది. దీంతో ఆ విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లయింది.

విడిగా ఉంటూ భార్యగా ఉంటానంటే ఎలా?

నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించేలా నిర్ణయం తీసుకోవద్దని పలువురు విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ వ్యవహారంపై మూడురోజుల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలంటూ మిశ్ర తొలుత వర్సిటీ వీసీని ఆదేశించారు. 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు లేఖ రాశారు. అయితే, దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యార్థులతో తనకు జరుగుతున్న సంవాదంలో జోక్యం చేసుకోవడానికి బీసీఐ ఎవరు అని సీజేఐ సైతం ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే.

# అయోధ్య రామాలయ ట్రస్ట్ తొలి సీఈవోగా ఎయిర్ మార్షల్(రిటైర్డ్) జితేంద్ర మిశ్ర

మొదటిపేజీ తరువాయి

అయోధ్య: భారత వాయుసేన (ఐఏఎఫ్) మాజీ ఉన్నతాధికారి, ఎయిర్‌మార్షల్ జితేంద్ర మిశ్ర.. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి సీఈవోగా బుధవారం నియమితులయ్యారు. సీఈవో పోస్టుకు మొత్తం 5,585 దరఖాస్తులు రాగా వివిధ దశల్లో వాటిని వడగట్టిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ...చివరకు అన్ని విధాలా అర్హతలున్న, అత్యంత సమర్థులైన ముగ్గురు అభ్యర్థుల పేర్లను ట్రస్ట్‌కు సిఫార్సు చేసింది. ఆ ముగ్గురిలో ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్ర (62) ఎంపికయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అత్యంత కీలకమైన వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు ఎయిర్ మార్షల్ జితేంద్ర నేతృత్వం వహించారు. విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు ‘సర్వోత్తమ్ యుద్ధ సేవా మెడల్’ పురస్కారం లభించింది. సైన్యంలో దీర్ఘకాలం సేవలందించినందుకు గాను ‘అతి విశిష్ట సేవా మెడల్’, ‘విశిష్ట సేవా మెడల్’ పురస్కారాలనూ ఆయన అందుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవరియా జిల్లాకు చెందిన జితేంద్ర మిశ్ర...1986 డిసెంబరు 6న పైలట్‌గా ఐఏఎఫ్‌లో చేరారు. వివిధ హోదాల్లో 39ఏళ్ల పాటు సేవలందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవీ విరమణ చేశారు. రామాలయ విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలిసారి సీఈవోని నియమించాలని నిర్ణయించింది. భారీ సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన, వడపోతకు కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఎంపిక కమిటీ వినియోగించింది. దీనిలో భాగంగా 5,585 మంది అభ్యర్థుల్లో 3,577 మంది మాత్రమే 600 మార్కుల విధానం కింద పరిశీలన కోసం వివరాలను సమర్పించారు. ఈ ప్రక్రియలో 470కి పైగా మార్కులు వచ్చిన 108 మంది అభ్యర్థులను వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు చేశారు. వీరి నుంచి 16 మంది అభ్యర్థులను ఎంపిక చేసి అయోధ్యలో ఆగస్టు 11, 12 తేదీల్లో ముఖాముఖి భేటీలు నిర్వహించారు. చివరకు సమర్థ నాయకత్వ లక్షణాలు, నిర్వహణ నైపుణ్యాలు, సత్యనిష్ఠ, దార్శనికత గలిగిన ముగ్గురు అభ్యర్థుల జాబితాను ఎంపిక కమిటీ రూపొందించి ట్రస్ట్‌కు అందజేసింది.

ప్రధాన కార్యదర్శిగా గోవింద్ దేవ్ గిరి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం సమావేశమై ఎంపిక కమిటీ సమర్పించిన సీఈవో అభ్యర్థుల జాబితాను పరిశీలించింది.

# రూ.3 కోట్ల విలువైన 600 కిలోల గంజాయి పట్టివేత

**- అనకాపల్లి రూరల్ పోలీసుల మెరుపుదాడి.. ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్**




**అనకాపల్లి, సెప్టెంబర్ 3, గాయత్రి ప్రతినిధి:** అనకాపల్లి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసులు చేపడుతున్న విస్తృత తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి అనకాపల్లి మీదుగా తుని వైపు తరలిస్తున్న 600 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 3 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌తో పాటు పైలట్‌గా వ్యవహరిస్తున్న హోండా సివిక్ కారును స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ గురువారం మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.జైలు పరిచయంతో గంజాయి రవాణా

పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ధర్మాజీగూడెంకు చెందిన షేక్ మస్తాన్ వలి (ఏ-1) గతంలో గంజాయి కేసులో విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్న సమయంలో నర్సీపట్నానికి చెందిన ఏ-3తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ద్వారా భారీ స్థాయిలో గంజాయి రవాణాకు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు తెలిపారు.ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పరిధిలోని దగుడుపల్లికి చెందిన ఏ-2 నుంచి 600 కిలోల గంజాయిని సేకరించి, తుని సమీపంలో అప్పగిస్తే సరుకు ధరకు అదనంగా రూ.3 లక్షల కమీషన్ చెల్లించేలా ఏ-3 ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.చెక్‌పోస్టులు తప్పించుకునేందుకు పక్కా ప్లాన్ పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు గంజాయిని ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి నడక ద్వారా, మోటార్‌సైకిళ్లపై దఫదఫాలుగా తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. అనంతరం గంజాయిని ఏపీ39 వీఏ 6786 నంబర్ గల వ్యాన్‌లో లోడ్ చేశారు.ఈ వ్యాన్‌కు ముందుగా ఏపీ16 డీజ 0018 నంబర్ గల హోండా సివిక్ కారును పైలట్ వాహనంగా ఏర్పాటు చేసి తుని వైపు తరలించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.

### సంపతిపురం జంక్షన్ వద్ద పట్టివేత

పక్కా సమాచారంతో అనకాపల్లి రూరల్ పోలీసులు రంగంలోకి దిగారు. రూరల్ ఎస్సై జి. రవికుమార్ ఆధ్వర్యంలోని సిబ్బంది అనకాపల్లి మండలం పతిపురం జంక్షన్ వద్ద మాటువేసి గంజాయి లోడుతో వెళ్తున్న వ్యాన్‌ను, దాని ముందు వెళ్తున్న పైలట్ కారును అడ్డుకున్నారు.వాహనాలను తనిఖీ చేయగా భారీగా గంజాయి బయటపడటంతో స్వాధీనం చేసుకున్నారు.ముగ్గురు అరెస్ట్.. ముగ్గురు పరారీ ఈ కేసులో - షేక్ మస్తాన్ వలి (ఏ-1) -- ధర్మాజీగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా- షేక్ మదీనా (ఏ-4) - పాంగి రత్నాలు (ఏ-6) -- అల్లూరి సీతారామరాజు జిల్లాలను పోలీసులు అరెస్ట్ చేశారు.ఇక ఏ-2 (ఒడిశా), ఏ-3 (నర్సీపట్నం),ఏ-5 (అల్లూరి సీతారామరాజు జిల్లా) పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. నిందితులపై గతంలోనూ గంజాయి కేసులు అరెస్టయిన, పరారీలో ఉన్న నిందితుల్లో కొందరిపై గతంలోనూ గంజాయి కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఏ-1 షేక్ మస్తాన్ వలిపై జి.మాడుగుల, కిర్లంపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయి.ఏ-3పై గొలుగొండ, మార్టూరు, కిర్లంపూడి, జగ్గంపేట, టంగుటూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఐదు గంజాయి కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఇతనిపై ప్రాఃఖ-చీణూూ చట్టం కింద నిర్బంధ చర్యలు (ూణ ూాఙ్) తీసుకునేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఏ-6 పాంగి రత్నాలుపై జి.మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదై ఉందని పోలీసులు తెలిపారు.పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు భారీ గంజాయి రవాణా ముఠాను పట్టుకోవడంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. ఎస్‌బీ సీఐ ఎస్. బాల సూర్యరావు, అనకాపల్లి టౌన్ సీఐ జి. ప్రేమకుమార్, రూరల్ సీఐ జి. అశోక్‌కుమార్, రూరల్ ఎస్సై జి. రవికుమార్, టౌన్ ఎస్సై షేక్ జిలాని, ఈగల్ టీం సీఐలు టి. ధనుంజయ నాయుడు, వి. నాగరాజుతో పాటు వారి సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు. అక్రమ మత్తు పదార్థాల వ్యాపారానికి పాల్పడే వారిపై ప్రాఃఖ-చీణూూ, ూణ ూాఙ్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ. శ్రీనివాసులుతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల కృష్ణ లీలలతో అలరించిన వాసవి విద్యానికేతన్

**- వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**మార్కాపురం, సెప్టెంబర్ 3: గాయత్రి న్యూస్ ప్రతినిధి** మార్కాపురంలోని వాసవి విద్యానికేతన్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సందడి చేయడంతో



పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె. రంగయ్య శ్రీకృష్ణుని ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. అనంతరం జన్మాష్టమి విశిష్టతను, శ్రీకృష్ణుడి బోధనలను విద్యార్థులకు వివరించారు.పాఠశాల ఎ.ఓ. రంజిత్ కుమార్ శ్రీకృష్ణ జన్మాష్టమి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కాశయ్య శ్రీకృష్ణుడి బాల్య లీలలు, ధర్మ పరిరక్షణలో ఆయన పాత్రను విద్యార్థులకు తెలియజేశారు.చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల నృత్యాలు, వివిధ ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేలా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఘనంగా ఎస్సీ బాలుర వసతి గృహం ప్రారంభోత్సవం**

బజార్‌హత్నూర్/ఆదిలాబాద్:ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులను కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం బజార్‌హత్నూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల



నర్సయ్యలతో కలిసి ప్రారంభించారు.?అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. త్వరలోనే నూతన హాస్టల్ భవనాలకు అనుమతులు వస్తాయని, పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు కొత్త యూనిఫాంలు, షూలు అందజేస్తామన్నారు.?ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తున్నాయని, విద్యార్థులు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ మండలంలోని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ శ్యాంసుందర్, ఎంపిడిఓ మహేందర్, సర్పంచ్ సాయన్న, ఏఏపిసి చైర్మన్ నవనీత, వార్డెన్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# జే.ఎస్.పి క్రికెట్ టోర్నీ సీజన్-1కు ఘన ముగింపు

**- క్రీడాకారుల కోసం ముందుకొచ్చిన కొట్టే సాయి ప్రసాద్, కోలా ఆనంద్**
**- మురళి నాయుడు నేతృత్వంలో జే.బీ.ఎస్ క్రికెట్ క్లబ్ అద్భుత నిర్వహణ**

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్** యువతను చెడు మార్గాలకు దూరంగా ఉంచి క్రీడల వైపు మళ్లించాలనే ఉద్దేశంతో నిర్వహించిన జే. ఎస్.పి క్రికెట్ టోర్నమెంట్ సీజన్--1 విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్ నిర్వహణలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జనసేన పార్టీ చిత్తూరు--తిరుపతి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీకాళహస్తీశ్వర ఆలయ దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ప్రత్యేక చొరవ చూపారు. టోర్నీకి అవసరమైన సహకారం, స్పాన్సర్‌షిప్ అందించడంతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారికి అండగా నిలిచారు.కోలా ఆనంద్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ విజేత జట్టుకు రూ.30 వేల మొదటి బహుమతిని అందించారు. టోర్నీ జరుగుతున్న రోజుల్లో క్రీడాకారులకు వాటర్ బాటిళ్లు, పానీయాలను అందించి ఉత్సాహపరిచారు. కొట్టే సాయి ప్రసాద్ టోర్నీ నిర్వహణలో ముందుండి క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు. టోర్నీని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తూ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.గత నెల ఆగస్టు 15న ప్రారంభమైన టోర్నీలో సుమారు 60 జట్లు పాల్గొన్నాయి. శ్రీకాళహస్తిలోని ఎస్.వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో వరుసగా మ్యాచ్‌లు నిర్వహించారు. సెప్టెంబరు 2న పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. నాయుడుపేటకు చెందిన జీ.ఎన్.ఎస్ టీం జట్టు విజేతగా నిలవగా.. శ్రీకాళహస్తికి చెందిన ఎస్.సీ.సీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతకు రూ.30 వేలు, రన్నరప్‌కు రూ.15 వేల నగదు బహుమతులు అందించారు.టోర్నీ నిర్వహణ బాధ్యతలను క్రికెట్ ప్రేమికుడు మురళీనాయుడు ఆధ్వర్యంలో జే.బీ.ఎస్ సభ్యులు చేపట్టారు. మైదానం సిద్ధం చేయడం, మ్యాచ్‌ల నిర్వహణ తదితర ఏర్పాట్లలో సభ్యులు కష్టపడ్డారు. టోర్నీలో ఎస్.సీ.సీ కి చెందిన క్రాంతి బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా, ఉదయ్ బెస్ట్ బౌలర్‌గా, జే.బీ.ఎస్ టీం జట్టుకు చెందిన అర్జున్ ఎం.వీ.పీ గా నిలిచారు. అరేబియన్ బిర్యానీ రెస్టారెంట్, అమరావతి చికెన్ సెంటర్ స్పాన్సర్లుగా నిలిచి ఫోర్లకు రూ.100, సిక్సర్లకు రూ.500 చొప్పున బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా కోలా



ఆనంద్, కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చన్నారుయువతను క్రీడల వైపు మరింతగా ప్రోత్సహించేందుకు భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. టోర్నీని విజయవంతం చేసిన మురళి నాయుడు, జేబీఎస్ నిర్వాహకులు, క్రీడాకారులను అభినందించారు.

# బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

**- బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన అధికారులు**

**గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్** ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దాచారం పంచాయతీ పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో 14 సంవత్సరాల బాలికకు వివాహం చేసేందుకు జరుగుతున్న ఏర్పాట్లను ఐసీడీఎస్ అధికారులు,బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సీడీపీఓ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బంది, బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులు గ్రామానికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలపై వారికి అవగాహన కల్పించి వివాహాన్ని నిలిపివేశారు.ఈ సందర్భంగా సీడీపీఓ అనంతలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండకముందే వివాహం చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్యకు ఆటంకం కలగడంతో పాటు వారి





శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. బాలికల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాలు జరగకుండా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఎంఈఓ గిరి భగవాన్ దాస్ మాట్లాడుతూ బాలికలు చదువును కొనసాగించి ఉన్నత స్థాయికి ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల బాలికల భవిష్యత్తు దెబ్బతింటుందని, బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ, గ్రామ, మండల బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి కష్టాలు తీర్చండి.. గుంతకల్ బీజేపీ వినతి

**- పనిచేయని బోర్లకు మరమ్మతులు.. అవసరమైన చోట కొత్త బోర్లు వేయాలని డిమాండ్**



**గుంతకల్, సెప్టెంబర్ 3, గాయత్రి ప్రతినిధి:** గుంతకల్ పట్టణంలో తీవ్రంగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు స్థానిక ఆర్డీవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. తక్కువ వర్షపాతం కారణంగా పట్టణంలో వారానికి ఒకసారి మాత్రమే నీటిని విడుదల చేస్తున్న పరిస్థితుల్లో ప్రజలు తాగునీరు, వాడుక నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు.పట్టణంలోని పలు కాలనీల్లో ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన సింటెక్స్‌లు, బోర్లు ప్రస్తుతం మరమ్మతులకు గురై వినియోగానికి దూరంగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనిచేయని బోర్లను పునరుద్ధరించాలని, సింటెక్స్‌లకు మరమ్మతులు చేయించాలని కోరారు. సౌకర్యాలు లేని ప్రాంతాల్లో కొత్త బోర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.బీజేపీ నాయకుల వినతిపై ఆర్డీవో స్పందిస్తూ సమస్య పరిష్కారానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో వడ్డే రమేష్, వనగొంది విజయలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి శివ, గుర్రం సూర్యనారాయణ, జీఎం మహేష్, నారాయణరెడ్డి, మహిళా మోర్చా నాయకులు లక్ష్మీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్లోక స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- డాన్సులు, ఆటపాటలతో అలరించిన చిన్నారులు
- సందడిగా సాగిన ఉట్టి కొట్టే ఆట




**గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్**

కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని కుక్కునూరులోని శ్లోక స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, రాధ వేషధారణలో సందడి చేయగా, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్సులు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పోటీపడగా, 9వ తరగతికి చెందిన సాయి ప్రణదీప్ ఉట్టి కొట్టే ఆటలో విజయం సాధించాడు. విజేతకు తన తండ్రి జ్ఞాపకార్థంగా మురళి సార్ రూ.516 నగదు బహుమతిని అందజేశారు. కృష్ణాష్టమి వేడుకల్లో శ్లోక స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పేరెంట్స్ పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చిన్నారుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, సాంప్రదాయ ఆటలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో పాల్గొన్న షైన్ విద్యార్థులు..చైర్మన్ మూగల కుమార్ యాదవ్ వెల్లడి



**హనుమకొండ, సెప్టెంబర్ 3, గాయత్రి న్యూస్ ప్రతినిధి:**

బాలసముద్రం లోని స్థానిక షైన్ ప్రైమరీ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ మరియు గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీకృష్ణుని జీవిత విశేషాలు,ఆయన బోధనలు మరియు భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వరించారు.చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో ఉట్టి కొట్టే కార్యక్రమం, నృత్యాలు, భక్తి గీతాలతో వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చారు. ఇటువంటి పండుగల ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవ భావం పెంపొందుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా షైన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్ రమా యాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ సబిత వర్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేశారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన జనసైనికులకు కృతజ్ఞతలు

**శ్రీకాళహస్తి, గాయత్రి న్యూస్, సెప్టెంబర్ 3: రిపోర్టర్ : మునిరత్నం**



జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువతకు జనసేన నాయకుడు గంధం దిలీప్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేదలకు అన్నదానం చేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేసిన జనసైనికుల సేవలను ఆయన అభినందించారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరవనితలు, యువత ఇదే స్ఫూర్తితో మరింతగా పనిచేయాలని దిలీప్ బాబు ఆకాంక్షించారు.

# శ్రియ-జనక్‌లకు జగన్ వివాహ శుభాకాంక్షలు

కర్నూలులో వివాహ రిసెప్షన్‌కు హాజరైన మాజీ ముఖ్యమంత్రి





**కర్నూలు, సెప్టెంబర్ 3: గాయత్రీ ప్రతినిధి రామడుగు శివకుమార్**

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలులో జరిగిన వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్నారు. సెయింట్ జోసెఫ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్‌రెడ్డి కుమారుడు జనక్ వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది.రిసెప్షన్‌కు హాజరైన జగన్ నూతన వధూవరులు శ్రియ--జనక్‌లను ఆశీర్వదించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాల షెడ్యూల్ విడుదల



**విజయవాడ,సెప్టెంబర్ 3, గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్:**

అక్టోబర్ 11 నుంచి 20 వరకూ దసరా మహోత్సవాల్లో అమ్మవారి అలంకారాలు అక్టోబర్ 11 వ తేదీ బాలా త్రిపురసుందరీ దేవి 12వ తేదీ గాయత్రీ దేవి 13వ తేదీ అన్నపూర్ణాదేవి 14వ తేదీ మహాచండీ దేవి 15వ తేదీ లలితా త్రిపుర సుందరీ దేవి 16వ తేదీ సరస్వతి దేవి (మూలానక్షత్రం) 17వ తేదీ మహాలక్ష్మీ దేవి 18వ తేదీ దుర్గాదేవి ( దుర్గాష్టమి) 19వ తేదీ మహిషాసుర మర్ధిని దేవి (మహర్నవమి) 20వ తేదీ రాజరాజేశ్వరి దేవి (విజయదశమి)

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు విశేష స్పందన

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్**



జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతం కావడం పట్ల జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు గంధం ఢిల్లీబాబు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేదలకు అన్నదానం చేసి, జనసేన కార్యకర్తలకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఢిల్లీబాబు కోరారు. జన్మదిన వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువతకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# జగ్గంపేట టౌన్ లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

- 10 మందికి 7 లక్షల 84 వేల 639 రూపాయల చెక్కులు



**కాకినాడ జిల్లా, జగ్గంపేట, సెప్టెంబర్ 3 /ఎన్ టైమ్స్ ప్రతినిధి**

జగ్గంపేట టౌన్ లో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 10 మందికి 7 లక్షల 84 వేల 639 రూపాయల విలువైన చెక్కులను గురువారం మోటారు బైక్ పై ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ హాజరై 10 మంది ఇళ్లకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, ఎస్ ఏ గఫూర్, రాయి సాయి, పీలా మహేష్, వైబోగుల కొండబాబు యాదవ్, నేదూరి గణేష్, దుర్గపు ప్రకాష్, సాంబతుల చంద్రశేఖర్, నలమాటి ఆనంద్, చెలికాని హరి గోపాల్, ఎండి కాజా, దేగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

# పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 60వ డివిజన్ లో పేదలకు చీరలు, పండ్లు పంపిణీ

**విజయవాడ, సెప్టెంబర్ 3 (ఎన్ టైమ్స్ ప్రతినిధి):**



జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 60వ డివిజన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 60వ డివిజన్ జనసేన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది పేద కుటుంబాలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ అధ్యక్షులు కుప్పాల శ్రీనివాస్, నగర ఉపాధ్యక్షులు కమల్ల సోమనాథం, నగర అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ నజీబ్, 60వ డివిజన్ ఉపాధ్యక్షులు బెనర్జీ, ప్రధాన కార్యదర్శి సిద్దు, జనసేన నాయకులు దుర్గారావు, గంధ సిరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహిళలు మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తగా ఉంటూ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న నగర ఉపాధ్యక్షులు కమల్ల సోమనాథం ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నాయకులు అందుబాటులో లేకపోయినా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో సోమనాథం ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా పేదలకు సేవ చేయడం ద్వారా జరుపుకోవడం స్ఫూర్తిదాయకమని వారు అన్నారు

# జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో అంబరాన్నంటిన కృష్ణ జన్మాష్టమి సంబరాలు

**జగ్గంపేట, సెప్టెంబర్ 03:ఎన్ టైమ్స్ ప్రతినిధి**



జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో క్యాంపస్ మొత్తం బృందావనంలా మారిపోయింది.వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో స్టేజ్ పై సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణాష్టమి శ్లోకాలు ఆలపించి అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, ప్రిన్సిపల్ కే అభి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సుబ్బారెడ్డి సాగర్ నీటిని పొదుపుగా వినియోగించాలి

- పశువులు,తాగునీటి అవసరాలకే పరిమితం చేయాలి..
- కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పేర్కొన్న ఎమ్మార్వో ఎం సూర్యప్రభ,ఏవో జోకా అమృత



గాయత్రి న్యూస్
ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామంలోని సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉన్నందున ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని అధికారులు సూచించారు.కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారి ఎం సూర్యప్రభ,మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు.ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో పశువుల అవసరాలు,తాగునీటి అవసరాల మేరకు మాత్రమే నీటిని వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ వ్యవసాయ అధికారులకు సూచించారు.ఈ సమాచారాన్ని తమ పరిధిలోని గ్రామాలకు చేరవేసి,నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు.ఇందులో భాగంగా ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం,వేములపాలెం గ్రామాల్లోనూ ఏవో జోకా అమృత ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రస్తుత నీటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.రైతులు ఆరుతడి పంటలు కానీ,పిఎండిఎస్ పంటలు వేసికోవాలని సూచించారు.

# రైతు భూమికి ప్రభుత్వ భరోసా, మీ భూమి – మీ హక్కుకు మరింత భరోసా – ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

- అమృతలూరులో 1836 మంది రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

గాయత్రి న్యూస్
రైతుల భూ హక్కులకు మరింత భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో భాగంగా అమృతలూరు గ్రామంలో రీసర్వే పూర్తయిన 1,836 మంది అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు.బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం మండల కేంద్రం అమృతలూరు గ్రామంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు ఎమ్మెల్యే పాస్‌పుస్తకాలను అందజేశారు.మండల తహాసిల్దార్,కూచిపూడి నెహ్రూ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే,నక్కా ఆనందబాబు మాట్లాడుతూ,రైతుల భూ హక్కుల పరిరక్షణ,భూ రికార్డుల్లో పారదర్శకత,భూ వివాదాల నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు.మీ భూమి – మీ హక్కు అనే నినాదంతో వ్యక్తిగత ఫోటోలు లేకుండా కేవలం ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించడం ద్వారా రైతుల భూ హక్కులకు ప్రభుత్వం నిష్పక్షపాతంగా భరోసా కల్పిస్తోందని తెలిపారు.రీసర్వే ద్వారా భూముల హద్దులు,విస్తీర్ణం, యాజమాన్య



వివరాల్లో స్పష్టత ఏర్పడటంతో భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అలాగే రైతులకు బ్యాంకు రుణాలు,ప్రభుత్వ సబ్సిడీలు,వ్యవసాయ మరియు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఈ పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉపయోగపడతాయని తెలిపారు.అమృతలూరు మండలంలో రీసర్వేకు వేగం ....అమృతలూరు మండల పరిధిలో మొత్తం 13 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోంది. ఇప్పటికే బోడపాడు,యలవర్రు, రుతాడిపర్రు,పెదపూడి గ్రామాల్లో రీసర్వే అనంతరం మొత్తం 2,448 పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ పూర్తయిందిని,ఈ కార్యక్రమాలను ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు చేతుల మీదుగా నిర్వహించినట్లు అధికారిక నివేదిక పేర్కొంది.తాజాగా అమృతలూరు గ్రామంలో మరో 1,836 పాస్‌పుస్తకాల పంపిణీ జరుగుతోంది.దీంతో మండలంలో ఇప్పటివరకు రీసర్వే అనంతరం పంపిణీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాల సంఖ్య 4,284కు చేరుతోందన్నారు.అదేవిధంగా, గోవాడ గ్రామంలో రీసర్వే పూర్తికాగా,అక్టోబర్ నెలలో సుమారు 1,950 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.ప్యాపర్రు,మోపర్రు,తురుమెళ్ల గ్రామాల్లో రీసర్వే పనులు కొనసాగుతుండగా,ఇంటూరు, పాంచాళవరం గ్రామాల్లో తదుపరి దశ పనులు కొనసాగుతున్నాయన్నారు.మూల్పూరు గ్రామంలో రీసర్వే పనులు ప్రారంభమయ్యాయి,కూచిపూడి గ్రామంలోనూ త్వరలో రీసర్వే పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.రైతులకు గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు....రైతులు తమ భూ హక్కులకు సంబంధించిన పత్రాల కోసం ఇబ్బందులు పడకుండా గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు.రీసర్వే ప్రక్రియను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి,అర్హులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను వేగంగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తూ, భూముల యాజమాన్య వివరాల్లో స్పష్టత రావడం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,కూటమి నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు, రైతులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో అఖిల్ విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- విద్యాసంస్థల చైర్మన్ ఇనకోటి గంగాధర్ ఆధ్వర్యంలో వేడుకలు..



గాయత్రి న్యూస్
కాకినాడ జిల్లా ప్రత్తిపాడు అఖిల్ విద్యాసంస్థల్లో ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అఖిల్ విద్యాసంస్థల చైర్మన్ ఇనకోటి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించగా,ఉట్టి కొట్టే సన్నివేశాన్ని విద్యార్థులు ఉత్సాహంగా ప్రదర్శించారు.చిన్నారుల వేషధారణలు,సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఇనకోటి గంగాధర్ చిన్నారులకు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించారు.భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు,పండుగల ప్రాధాన్యతను చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో సాంస్కృతిక చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు.వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ఉపాధ్యాయులకు,విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన గురువులకు అభినందనలు తెలిపారు.

# మంగళ్ విద్యాలయం విద్యార్థికి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు

గాయత్రి న్యూస్
పేటమిట్టలోని మంగళ్ విద్యాలయం విద్యార్థి షేక్ ఇంతియాజ్ అహ్మద్ నీట్--2026లో ప్రతిభ కనబరిచి, కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి విజయంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.మంగళ్ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన ఇంతియాజ్ అహ్మద్, 12వ తరగతి బోర్డు పరీక్షలతో పాటు నీట్ పరీక్షలోనూ ప్రతిభ కనబరిచాడు. ఎటువంటి ఆన్‌లైన్ కోచింగ్ లేదా బయట ప్రత్యేక శిక్షణ తీసుకోకుండా, పాఠశాలలో ఉపాధ్యాయులు అందించిన బోధన, సూచనలు, మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ ఈ ఘన విజయాన్ని సాధించాడు.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ శ్రీ గల్లా రామచంద్ర నాయుడు ఇంతియాజ్ అహ్మద్‌ను, అతని తల్లిదండ్రులను మరియు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.మంగళ్ విద్యాలయంలో అందించిన నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఇంతియాజ్ అహ్మద్ నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలో విజయం సాధించడం ఎంతో గర్వకారణం. ఎటువంటి అదనపు కోచింగ్ తీసుకోకుండా పాఠశాల బోధనతోనే ఎంబీబీఎస్ సీటు సాధించడం విద్యార్థి ప్రతిభకు, ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనం. ఇంతియాజ్ అహ్మద్ విజయం పాఠశాలలో చదువుతున్న ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా మంగళ్ విద్యాలయం తరఫున అన్ని విధాలా ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తామని" శ్రీ గల్లా రామచంద్ర నాయుడు



తెలిపారు.ఇంతియాజ్ అహ్మద్ సాధించిన విజయం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు యాజమాన్యం అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో వైద్య రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి, సమాజానికి సేవలందించే ఉత్తమ వైద్యుడిగా రాణించాలని ఆకాంక్షించారు.

# విజ్ఞాన్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు.

గాయత్రి న్యూస్



బంగారుపాళ్యం మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుని ప్రతిమను అందంగా కొలువు తీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ ఆర్.ఎన్. జ్యోతినాథ్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మానవాళికి భగవద్గీత ద్వారా జీవన విధానాల గురించి గొప్ప సందేశం ఇవ్వడం జరిగిందని తెలిపారు. సాంప్రదాయ పండుగలను జరుపుకోవడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హిమగిరి,చిట్టిబాబు, రవితేజ,బేబీరాణి పలువురు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పురపాలక సంఘం వార్డు వారీ ఫోటో ఓటర్ల జాబితాల ప్రచురణ

గాయత్రి న్యూస్
కనిగిరి పురపాలక సంఘంలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన సూచనల మేరకు కనిగిరి పురపాలక సంఘంలోని 32 వార్డులకు సంబంధించి వార్డు వారీ ఫోటో ఓటర్ల జాబితాలు సిద్ధం చేసి గురువారంన ప్రచురించడం జరిగినదని మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఓటర్ల జాబితాలు 01-01-2026 ను అర్హత తేదీగా తీసుకొని సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గం యొక్క తాజా ఓటర్ల జాబితా నుండి, వార్డు డీలిమిటేషన్‌కు అనుగుణంగా సిద్ధం చేశామని తెలిపారు. ప్రజల పరిశీలన నిమిత్తం వార్డు వారీ ఓటర్ల జాబితాలను పురపాలసంఘం కార్యాలయం, పట్టణంలోని వేర్వేరు ప్రభుత్వ కార్యాలయములలో నోటీసు బోర్డులపై అందుబాటులో ఉంచడం జరిగింది. ఎన్నికల జాబితాలో తమ పేరు, చిరునామా లేదా ఇతర వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే, సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని ఈఆర్వోసంప్రదించి, నిబంధనల ప్రకారం క్లెయిమ్ / ఆబ్జెక్షన్ దాఖలు చేయవలసి ఉంటుందని తెలిపారు. కనిగిరి పురపాలక సంఘ పరిధిలోని ఓటర్లు తమకు సంబంధించిన వార్డు ఓటర్ల జాబితాను పరిశీలించి, తమ పేరు మరియు వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని కమీషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి మేనేజర్ పూర్ణిమ,




ఆర్.ఐ వెంకటేష్, శానిటరి ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, హెల్త్ అసిస్టెంట్ కేశవ, ఇంచార్జ్ టి.పి.బి.ఓ కృష్ణ, వార్డు ప్లానింగ్ సెక్రెటరీలు, మునిసిపల్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడికొండూరులో అన్ని శాఖల అధికారులతో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిపై సమీక్ష

గాయత్రి న్యూస్

మేడికొండూరు మండల ప్రజా పరిషత్ నందు ఈ రోజు అనగా ది.03-09-2026 సాయంత్రం గం.4:00 ల నుండి తాడికొండ శాసన సభ నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీ బి.వి.నాగ సాయి కుమార్ , మరియు మండల ప్రత్యేక అధికారి శ్రీమతి యం.పద్మావతి అన్ని శాఖల అధికారులతో ప్రభుత్వం అమలు చేయుచున్న అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించియున్నారు. ప్రజల నుండి సమస్యల పరిష్కారం కొరకు ప్రజా పరిష్కార వేదిక ద్వారా రాబడిన అర్జీలను వెంటనే పరిష్కారం చూపవలసినదిగా అన్ని శాఖల అధికారులను కోరియున్నారు.ప్రస్తుతము ఎలక్షన్ కమీషనర్ వారి ఆదేశముల ప్రకారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమము గ్రామాలలో బి ఎల్ ఓ ల ద్వారా నో మ్యాపింగ్ / యనామలి ఓటర్స్ విషయములో నోటీసులు జారీచేసి ఏ ఈ ఆర్ ఓ లు విచారణ నిర్వహించుచున్నందున ప్రగతి సాధించవలసినదిగా మరియు ఫారం -6,7 ః 8 ద్వారా రాబడిన క్లైములను పరిష్కారం గడువులోగా చూపవలసినదిగా అధికారులను కోరియున్నారు.అన్ని గ్రామాలలో ఉపాధి కూలీలకు ఉపాధి కల్పించుటకు చర్యలు తీసుకోవలసినదిగా, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ వేజ్ కాంపోనెంట్ ప్రగతి సాధించవలసినదిగా ఏపీవో మరియు పంచాయతీ అభివృద్ధి అధికార్లను కోరియున్నారు.రెవెన్యూ శాఖకు సంబంధించి 22ఏ క్రింద జాబితాలను గైడ్ లైన్స్ ప్రకారం సవరణలు చేయుట, ల్యాండ్ రీ సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణి, రెవెన్యూ రికార్డులు ఆన్ లైన్ చేయు అంశం తదిదర అంశాల పై చర్చించి యున్నారు. వ్యవసాయ సీజన్ కావున రైతులకు ఏరువులు సరఫరా చేయుటకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకొని పంపిణికి చర్యలు తీసుకోవలసిందిగా మండల స్థాయి వ్యవసాయ అధికారికి తెలిపియున్నారు.హౌసింగ్ స్కీం ద్వారా అర్హులైన లబ్దిదారుల ద్వారా మంజూరు అయిన గృహాలను వెంటనే పూర్తి చేయించి ప్రగతి చూపవలసినదిగా మండల స్థాయి అసిస్టెంట్ ఇంజనీర్ హౌసింగ్ శాఖ వారిని కోరియున్నారు. విద్యాశాఖ అధికారులు ప్రతి విద్యార్థి స్కూలుకు హాజరు అయ్యే విధముగా చర్యలు గైకొని డ్రాప్ అవుట్స్ లేకుండా చూసి మద్యాహ్న భోజనం విద్యార్థిని, విద్యార్దులకు ప్రభుత్వ ఆదేశముల



ప్రకారం రోజు వారీ మెనూ అనుసరించి ఇవ్వవలసినడిగా మండల విద్యా శాఖాధికారికి తెలిపియునారు.గ్రామాల్లో అర్హులైన వారిని పించను పొందుటకు గుర్తించి ప్రయార్టి ప్రకారం పభుత్వం మంజూరు చేసిన సమయములో పించను పొందుటకు చర్యలు తీసుకోవలసినదిగా కోరియున్నారు. ఇంకా అమలు జరుగుచున్న వెలుగు, అక్షరాస్యత, ఐ.సి.డి.యస్., కార్యక్రమాలను మరియు స్వర్ణ గ్రామము శాఖ ద్వారా అమలు జరుగుచున్న సర్వేలు పై సమీక్ష నిర్వహించియున్నారు. ఈ సమీక్షా సమావేశము నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహశీల్దార్ మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెనాలి - చందోలు (కూచిపూడి) రహదారి పనులకు వేగం

**- ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు ప్రత్యేక చొరవతో ప్రారంభమైన పెండింగ్ పనులు**



గాయత్రి న్యూస్

గత 10 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తెనాలి - చందోలు (కూచిపూడి) రహదారి నిర్మాణ పనులకు ఎట్టకేలకు వేగం వచ్చింది. వేమూరు ఎమ్మెల్యే,మాజీ మంత్రి,నక్కా ఆనందబాబు ప్రత్యేక చొరవతో పెండింగ్ పనులు ప్రారంభమై ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి.తెనాలి - చందోలు రహదారిలో రహదారి ఇరువైపులా జంగల్ క్లియరెన్స్ పనులు పూర్తికాగా,ప్రస్తుతం డిగ్గింగ్ పనులు ప్రారంభమయ్యాయి.పెదరావూరు నుంచి సుమారు 4 కి.మీ. మేర రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి.కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితిని అధిగమించేందుకు ఎమ్మెల్యే స్వయంగా కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రారంభించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు.అలాగే అంగలకుదురు - నడిగడ్డపాలెం రహదారి నిర్మాణ పనులు కూడా ఇప్పటికే కొనసాగుతున్నాయని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.రహదారి పనుల పురోగతిపై ఎమ్మెల్యే,ఆనంద బాబు అధికారులతో సమీక్షించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేసి,నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజల సౌకర్యమే లక్ష్యం అభివృద్ధే ధ్యేయం గా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది.

# రెడ్డిగూడెం మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం.

గాయత్రి న్యూస్

మైలవరం నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు.ఇందులో భాగంగా రెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం రూ.7.9 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేశారు.రూ.2.2 కోట్ల అంచనా వ్యయంతో విజయవాడ--విస్సన్నపేట ప్రధాన రహదారి నుంచి నరుకుళ్లపాడు వరకు చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు తాటిగూడెం వద్ద ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శంకుస్థాపన చేశారు.అదేవిధంగా రూ.3.3 కోట్ల అంచనా వ్యయంతో విజయవాడ--విస్సన్నపేట రహదారి నుంచి అన్నేరావుపేట వరకు నిర్మించనున్న రహదారి అభివృద్ధి పనులకు కూడా



శంకుస్థాపన చేశారు.మరోవైపు రూ.2.4 కోట్ల అంచనా వ్యయంతో ఎం.ఎన్.కె. రోడ్డు నుంచి మాధవరం వరకు వయా కూనపరాజుపర్వ మీదుగా చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడం ద్వారా ఆయా గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రహదారుల అభివృద్ధితో వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడంతో పాటు, అత్యవసర సమయాల్లో రాకపోకలు సులభతరం కానున్నాయి.ఎప్పటినుంచో పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న రహదారి సమస్యలకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించి, పనులకు శంకుస్థాపన చేయడం పట్ల స్థానిక ప్రజలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కి వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# గిద్దలూరు మున్సిపాలిటీలో 28 వార్డుల ఓటర్ల జాబితా విడుదల

**-ప్రజల పరిశీలనకు అందుబాటులో తుది ముసాయిదా..**

**మొత్తం 30,633 మంది ఓటర్లు**



గాయత్రి న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 12న జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలోని 28 వార్డుల ఫోటో ఓటర్ల జాబితాలను గురువారం విడుదల చేశారు. పట్టణంలోని అన్ని వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ప్రజల పరిశీలనార్థం గిద్దలూరు పురపాలక సంఘ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు తెలిపారు. ఓటర్లు తమ పేర్లు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలో మొత్తం 30,633 మంది ఓటర్లు ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. వీరిలో 15,032 మంది పురుష ఓటర్లు, 15,592 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. వార్డుల వారీగా విడుదల చేసిన ఫోటో ఓటర్ల జాబితాలను ప్రజలు పరిశీలించి తమ వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.

# "డ్రగ్స్ వద్దు బ్రో" - విద్యార్థులకు మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన

గాయత్రి న్యూస్

జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, గారి ఆదేశాల మేరకు పలమనేరు డి.ఎస్పీ శ్రీ దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో బంగారుపాళ్యం మండల కేంద్రంలోని గ్లాసూ పాఠశాలలో 9వ, 10వ తరగతి విద్యార్థులకు "డ్రగ్స్ వద్దు బ్రో" పేరుతో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ శ్రీ కత్తి శ్రీనివాసులు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు, విద్యాభ్యాసం, భవిష్యత్తు మరియు కుటుంబ జీవితంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. చెడు స్నేహాలు, ఆకర్షణలకు లోనై మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన అనర్థాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు భయపడకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి - - ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయండి" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు.సమాజంలో ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం



జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1972కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గా× ప్రసాద్, జూగా+గాజు టీమ్ ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ బంగారుపాళ్యం పిఎస్

# కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి




గాయత్రి న్యూస్

బెల్లంకొండ మండల కేంద్రంలోని చంద్రాజుపాలెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు విధులు నిర్వహించుచున్న మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన నిరసన గురువారం 13వ రోజుకు చేరింది. ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి వారి నిరసన కార్యక్రమములో భాగంగా ఆన్లైన్, ఆఫ్ లైన్ రిపోర్ట్స్,మరియుపెన్ డౌన్ నిరసన కార్యక్రమమును శాంతియుతంగా చేపట్టినారు. వీరి నిరసన కార్యక్రమమును ఏపీ ఎన్జీవోస్ క్రోసూరు తాలూకా యూనిట్ గురువారం వారి సంఘీభావం ప్రకటించి నారు

# రెడ్డిగూడెంలో రేషన్ షాప్-9పై ఆకస్మిక తనిఖీ.



గాయత్రి న్యూస్

మండల కేంద్రంలోని రేషన్ షాప్ నంబర్-9ను సివిల్ సప్లై డిటి నాగరాజు , ఆర్.ఐ. ప్రసాద్, బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో రేషన్ షాప్-9కు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీ చేపట్టినట్లు డిటి నాగరాజు, తెలిపారు.తనిఖీల్లో రేషన్ షాపులో నిల్వ ఉన్న బియ్యం, పంచదార, గోధుమపిండి తదితర సరుకుల ప్యాకెట్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను జాయింట్ కలెక్టర్ (జేసీ), ఆర్డీవోలకు పంపించినట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో రేషన్ షాప్ నంబర్-9 డీలర్ పోతురాజు శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు రేషన్ షాప్ నిర్వహణ బాధ్యతలను 10వ నంబర్ రేషన్ షాప్ డీలర్ మాతంగి బాబురావుకు ఇన్‌చార్జిగా అప్పగించినట్లు వెల్లడించారు.

# శ్లోక స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- దాన్సులు, ఆటపాటలతో అలరించిన చిన్నారులు
- సందడిగా సాగిన ఉట్టి కొట్టే ఆట




గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని కుక్కునూరులోని శ్లోక స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, రాధ వేషధారణలో సందడి చేయగా, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్సులు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పోటీపడగా, 9వ తరగతికి చెందిన సాయి ప్రణదీప్ ఉట్టి కొట్టే ఆటలో విజయం సాధించాడు. విజేతకు తన తండ్రి జ్ఞాపకార్థంగా మురళి సార్ రూ.516 నగదు బహుమతిని అందజేశారు. కృష్ణాష్టమి వేడుకల్లో శ్లోక స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పేరెంట్స్ పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చిన్నారుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, సాంప్రదాయ ఆటలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో పాల్గొన్న షైన్ విద్యార్థులు..చైర్మన్ మూగల కుమార్ యాదవ్ వెల్లడి



హనుమకొండ, సెప్టెంబర్ 3, గాయత్రి న్యూస్ ప్రతినిధి:

బాలసముద్రం లోని స్థానిక షైన్ ప్రైమరీ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ మరియు గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీకృష్ణుని జీవిత విశేషాలు,ఆయన బోధనలు మరియు భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వరించారు. చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో ఉట్టి కొట్టే కార్యక్రమం, నృత్యాలు, భక్తి గీతాలతో వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చారు. ఇటువంటి పండుగల ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవ భావం పెంపొందుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా షైన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్ రమా యాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ సబిత వర్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేశారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన జనసైనికులకు కృతజ్ఞతలు

శ్రీకాళహస్తి, గాయత్రి న్యూస్, సెప్టెంబర్ 3: రిపోర్టర్ : మునిరత్నం



జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువతకు జనసేన నాయకుడు గంధం దిలీప్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేదలకు అన్నదానం చేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేసిన జనసైనికుల సేవలను ఆయన అభినందించారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరవనితలు, యువత ఇదే స్ఫూర్తితో మరింతగా పనిచేయాలని దిలీప్ బాబు ఆకాంక్షించారు.

# శ్రియ-జనక్‌లకు జగన్ వివాహ శుభాకాంక్షలు

కర్నూలులో వివాహ రిసెప్షన్‌కు హాజరైన మాజీ ముఖ్యమంత్రి





కర్నూలు, సెప్టెంబర్ 3: గాయత్రీ ప్రతినిధి రామడుగు శివకుమార్

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలులో జరిగిన వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్నారు. సెయింట్ జోసెఫ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్‌రెడ్డి కుమారుడు జనక్ వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. రిసెప్షన్‌కు హాజరైన జగన్ నూతన వధూవరులు శ్రియ--జనక్‌లను ఆశీర్వదించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాల షెడ్యూల్ విడుదల



విజయవాడ,సెప్టెంబర్ 3, గాయత్రి న్యూస్ ప్రతినిధి రామడుగు శివకుమార్:

అక్టోబర్ 11 నుంచి 20 వరకూ దసరా మహోత్సవాల్లో అమ్మవారి అలంకారాలు అక్టోబర్ 11 వ తేదీ బాలా త్రిపురసుందరీ దేవి 12వ తేదీ గాయత్రీ దేవి 13వ తేదీ అన్నపూర్ణాదేవి 14వ తేదీ మహాచండీ దేవి 15వ తేదీ లలితా త్రిపుర సుందరీ దేవి 16వ తేదీ సరస్వతి దేవి (మూలానక్షత్రం) 17వ తేదీ మహాలక్ష్మీ దేవి 18వ తేదీ దుర్గాదేవి ( దుర్గాష్టమి) 19వ తేదీ మహిషాసుర మర్ధిని దేవి (మహర్నవమి) 20వ తేదీ రాజరాజేశ్వరి దేవి (విజయదశమి)

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు విశేష స్పందన

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్



జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతం కావడం పట్ల జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు గంధం ఢిల్లీబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేదలకు అన్నదానం చేసి, జనసేన కార్యకర్తలకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఢిల్లీబాబు కోరారు. జన్మదిన వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువతకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# జగ్గంపేట టౌన్ లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

- 10 మందికి 7 లక్షల 84 వేల 639 రూపాయల చెక్కులు



కాకినాడ జిల్లా, జగ్గంపేట, సెప్టెంబర్ 3 /ఎన్ టైమ్స్ ప్రతినిధి

జగ్గంపేట టౌన్ లో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 10 మందికి 7 లక్షల 84 వేల 639 రూపాయల విలువైన చెక్కులను గురువారం మోటారు బైక్ పై ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ హాజరై 10 మంది ఇళ్లకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, ఎస్ ఏ గఫూర్, రాయి సాయి, పీలా మహేష్, వైబోగుల కొండబాబు యాదవ్, నేదూరి గణేష్, దుర్గపు ప్రకాష్, సాంబతుల చంద్రశేఖర్, నలమాటి ఆనంద్, చెలికాని హరి గోపాల్, ఎండి కాజా, దేగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

# పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 60వ డివిజన్ లో పేదలకు చీరలు, పండ్లు పంపిణీ

విజయవాడ, సెప్టెంబర్ 3 (ఎన్ టైమ్స్ ప్రతినిధి):



జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 60వ డివిజన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 60వ డివిజన్ జనసేన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది పేద కుటుంబాలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ అధ్యక్షులు కుప్పాల శ్రీనివాస్, నగర ఉపాధ్యక్షులు కమల్ల సోమనాథం, నగర అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ నజీబ్, 60వ డివిజన్ ఉపాధ్యక్షులు బెనర్జీ, ప్రధాన కార్యదర్శి సిద్దు, జనసేన నాయకులు దుర్గారావు, గంధ సిరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహిళలు మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తగా ఉంటూ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న నగర ఉపాధ్యక్షులు కమల్ల సోమనాథం ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నాయకులు అందుబాటులో లేకపోయినా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో సోమనాథం ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా పేదలకు సేవ చేయడం ద్వారా జరుపుకోవడం స్ఫూర్తిదాయకమని వారు అన్నారు

# జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో అంబరాన్నంటిన కృష్ణ జన్మాష్టమి సంబరాలు

జగ్గంపేట, సెప్టెంబర్ 03:ఎన్ టైమ్స్ ప్రతినిధి



జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో క్యాంపస్ మొత్తం బృందావనంలా మారిపోయింది.వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో స్టేజ్ పై సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణాష్టమి శ్లోకాలు ఆలపించి అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, ప్రిన్సిపల్ కే అభి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రూ.3 కోట్ల విలువైన 600 కిలోల గంజాయి పట్టివేత

**- అనకాపల్లి రూరల్ పోలీసుల మెరుపుదాడి.. ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్**

**అనకాపల్లి, సెప్టెంబర్ 3, గాయత్రి ప్రతినిధి:** అనకాపల్లి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసులు చేపడుతున్న విస్తృత తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి అనకాపల్లి మీదుగా తుని వైపు తరలిస్తున్న 600 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌తో పాటు పైలట్‌గా వ్యవహరిస్తున్న హోండా సివిక్ కారును స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ గురువారం మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.జైలు పరిచయంతో గంజాయి రవాణా

పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ధర్మాజీగూడెంకు చెందిన షేక్ మస్తాన్ వలి (ఏ-1) గతంలో గంజాయి కేసులో విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్న సమయంలో నర్సీపట్నానికి చెందిన ఏ-3తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ద్వారా భారీ స్థాయిలో గంజాయి రవాణాకు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు తెలిపారు.ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పరిధిలోని దగుడుపల్లికి చెందిన ఏ-2 నుంచి 600 కిలోల గంజాయిని సేకరించి, తుని సమీపంలో అప్పగిస్తే సరుకు ధరకు అదనంగా రూ.3 లక్షల కమీషన్ చెల్లించేలా ఏ-3 ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.చెక్‌పోస్టులు తప్పించుకునేందుకు పక్కా ప్లాన్ పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు గంజాయిని ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి నడక



ద్వారా, మోటార్‌సైకిళ్లపై దఫదఫాలుగా తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. అనంతరం గంజాయిని ాూ39 వాా 6786 నంబర్ గల వ్యాన్‌లో లోడ్ చేశారు.ఈ వ్యాన్‌కు ముందుగా ాూ16 దీజ 0018 నంబర్ గల హోండా సివిక్ కారును పైలట్ వాహనంగా ఏర్పాటు చేసి తుని వైపు తరలించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.

### సంపతిపురం జంక్షన్ వద్ద పట్టివేత

పక్కా సమాచారంతో అనకాపల్లి రూరల్ పోలీసులు రంగంలోకి దిగారు. రూరల్ ఎస్సై జి. రవికుమార్ ఆధ్వర్యంలోని సిబ్బంది అనకాపల్లి మండలం పతిపురం జంక్షన్ వద్ద మాటువేసి గంజాయి లోడుతో వెళ్తున్న వ్యాన్‌ను, దాని ముందు వెళ్తున్న పైలట్ కారును అడ్డుకున్నారు.వాహనాలను తనిఖీ చేయగా భారీగా గంజాయి బయటపడటంతో స్వాధీనం చేసుకున్నారు.ముగ్గురు అరెస్ట్.. ముగ్గురు పరారీ ఈ కేసులో - షేక్ మస్తాన్ వలి (ఏ-1) -- ధర్మాజీగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా- షేక్ మదీనా (ఏ-4) - పాంగి రత్నాలు (ఏ-6) -- అల్లూరి సీతారామరాజు జిల్లాలను పోలీసులు అరెస్ట్ చేశారు.ఇక ఏ-2 (ఒడిశా), ఏ-3 (నర్సీపట్నం),ఏ-5 (అల్లూరి సీతారామరాజు జిల్లా) పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. నిందితులపై గతంలోనూ గంజాయి కేసులు అరెస్టయిన, పరారీలో ఉన్న నిందితుల్లో కొందరిపై గతంలోనూ గంజాయి కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఏ-1 షేక్ మస్తాన్ వలిపై జి.మాడుగుల, కిర్లంపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయి.ఏ-3పై గొలుగొండ, మార్టూరు, కిర్లంపూడి, జగ్గంపేట, టంగుటూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఐదు గంజాయి కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఇతనిపై ాాఖు-చీణూా చట్టం కింద నిర్బంధ చర్యలు (ాణ ాూష్) తీసుకునేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఏ-6 పాంగి రత్నాలుపై జి.మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదై ఉందని పోలీసులు తెలిపారు.పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు భారీ గంజాయి రవాణా ముఠాను పట్టుకోవడంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. ఎస్‌బీ సీఐ ఎస్. బాల సూర్యరావు, అనకాపల్లి టౌన్ సీఐ జి. ప్రేమకుమార్, రూరల్ సీఐ జి. అశోక్‌కుమార్, రూరల్ ఎస్సై జి. రవికుమార్, టౌన్ ఎస్సై షేక్ జిలాని, ఈగల్ టీం సీఐలు టి. ధనుంజయ నాయుడు, వి. నాగరాజుతో పాటు వారి సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు. అక్రమ మత్తు పదార్థాల వ్యాపారానికి పాల్పడే వారిపై ాాఖు-చీణూా, ాణ ాూష్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ. శ్రీనివాసులుతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల కృష్ణ లీలలతో అలరించిన వాసవి విద్యానికేతన్

**- వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**మార్కాపురం, సెప్టెంబర్ 3: గాయత్రి న్యూస్ ప్రతినిధి**

మార్కాపురంలోని వాసవి విద్యానికేతన్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సందడి చేయడంతో



పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె. రంగయ్య శ్రీకృష్ణుని ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. అనంతరం జన్మాష్టమి విశిష్టతను, శ్రీకృష్ణుడి బోధనలను విద్యార్థులకు వివరించారు.పాఠశాల ఎ.ఓ. రంజిత్ కుమార్ శ్రీకృష్ణ జన్మాష్టమి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కాశయ్య శ్రీకృష్ణుడి బాల్య లీలలు, ధర్మ పరిరక్షణలో ఆయన పాత్రను విద్యార్థులకు తెలియజేశారు.చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల నృత్యాలు, వివిధ ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేలా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఘనంగా ఎస్సీ బాలుర వసతి గృహం ప్రారంభోత్సవం**

బజార్‌హత్నూర్/ఆదిలాబాద్:ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులను కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం



బజార్‌హత్నూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యలతో కలిసి ప్రారంభించారు.?అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. త్వరలోనే నూతన హాస్టల్ భవనాలకు అనుమతులు వస్తాయని, పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు కొత్త యూనిఫాంలు, షూలు అందజేస్తామన్నారు.?ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తున్నాయని, విద్యార్థులు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ మండలంలోని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ శ్యాంసుందర్, ఎంపిడిఓ మహేందర్, సర్పంచ్ సాయన్న, ఏఏపిసి చైర్మన్ నవనీత, వార్డెన్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# జే.ఎస్.పి క్రికెట్ టోర్నీ సీజన్-1కు ఘన ముగింపు

**- క్రీడాకారుల కోసం ముందుకొచ్చిన కొట్టే సాయి ప్రసాద్, కోలా ఆనంద్**
**- మురళి నాయుడు నేతృత్వంలో జే.బీ.ఎస్ క్రికెట్ క్లబ్ అద్భుత నిర్వహణ**

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్**

యువతను చెడు మార్గాలకు దూరంగా ఉంచి క్రీడల వైపు మళ్లించాలనే ఉద్దేశంతో నిర్వహించిన జే. ఎస్.పి క్రికెట్ టోర్నమెంట్ సీజన్--1 విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్ నిర్వహణలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జనసేన పార్టీ చిత్తూరు--తిరుపతి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీకాళహస్తీశ్వర ఆలయ దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ప్రత్యేక చొరవ చూపారు. టోర్నీకి అవసరమైన సహకారం, స్పాన్సర్‌షిప్ అందించడంతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారికి అండగా నిలిచారు.కోలా ఆనంద్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ విజేత జట్టుకు రూ.30 వేల మొదటి బహుమతిని అందించారు. టోర్నీ జరుగుతున్న రోజుల్లో క్రీడాకారులకు వాటర్ బాటిళ్లు, పానీయాలను అందించి ఉత్సాహపరిచారు. కొట్టే సాయి ప్రసాద్ టోర్నీ నిర్వహణలో ముందుండి క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు. టోర్నీని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తూ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.గత నెల ఆగస్టు 15న ప్రారంభమైన టోర్నీలో సుమారు 60 జట్లు పాల్గొన్నాయి. శ్రీకాళహస్తిలోని ఎస్.వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో వరుసగా మ్యాచ్‌లు నిర్వహించారు. సెప్టెంబరు 2న పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. నాయుడుపేటకు చెందిన జీ.ఎన్.ఎస్ టీం జట్టు విజేతగా నిలవగా.. శ్రీకాళహస్తికి చెందిన ఎస్.సీ.సీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతకు రూ.30 వేలు, రన్నరప్‌కు రూ.15 వేల నగదు బహుమతులు అందించారు.టోర్నీ నిర్వహణ బాధ్యతలను క్రికెట్ ప్రేమికుడు మురళీనాయుడు ఆధ్వర్యంలో జే.బీ.ఎస్ సభ్యులు చేపట్టారు. మైదానం సిద్ధం చేయడం, మ్యాచ్‌ల నిర్వహణ తదితర ఏర్పాట్లలో సభ్యులు కష్టపడ్డారు. టోర్నీలో ఎస్.సీ.సీ కి చెందిన క్రాంతి బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా, ఉదయ్ బెస్ట్ బౌలర్‌గా, జే.బీ.ఎస్ టీం జట్టుకు చెందిన అర్జున్ ఎం.వీ.పీ గా నిలిచారు. అరేబియన్ బిర్యానీ రెస్టారెంట్, అమరావతి చికెన్ సెంటర్ స్పాన్సర్లుగా నిలిచి ఫోర్లకు రూ.100, సిక్సర్లకు రూ.500 చొప్పున బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా కోలా



ఆనంద్, కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చన్నారుయువతను క్రీడల వైపు మరింతగా ప్రోత్సహించేందుకు భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. టోర్నీని విజయవంతం చేసిన మురళి నాయుడు, జేబీఎస్ నిర్వాహకులు, క్రీడాకారులను అభినందించారు.

# నీటి కష్టాలు తీర్చండి.. గుంతకల్ బీజేపీ వినతి

**- పనిచేయని బోర్లకు మరమ్మతులు.. అవసరమైన చోట కొత్త బోర్లు వేయాలని డిమాండ్**



**గుంతకల్, సెప్టెంబర్ 3, గాయత్రి ప్రతినిధి:** గుంతకల్ పట్టణంలో తీవ్రంగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు స్థానిక ఆర్డీవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. తక్కువ వర్షపాతం కారణంగా పట్టణంలో వారానికి ఒకసారి మాత్రమే నీటిని విడుదల చేస్తున్న పరిస్థితుల్లో ప్రజలు తాగునీరు, వాడుక నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు.పట్టణంలోని పలు కాలనీల్లో ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన సింటెక్స్‌లు, బోర్లు ప్రస్తుతం మరమ్మతులకు గురై వినియోగానికి దూరంగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనిచేయని బోర్లను పునరుద్ధరించాలని, సింటెక్స్‌లకు మరమ్మతులు చేయించాలని కోరారు. సౌకర్యాలు లేని ప్రాంతాల్లో కొత్త బోర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.బీజేపీ నాయకుల వినతిపై ఆర్డీవో స్పందిస్తూ సమస్య పరిష్కారానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో వడ్డే రమేష్, వనగొంది విజయలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి శివ, గుర్రం సూర్యనారాయణ, జీఎం మహేష్, నారాయణరెడ్డి, మహిళా మోర్చా నాయకులు లక్ష్మీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

**- బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన అధికారులు**

**గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్**

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దాచారం పంచాయతీ పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో 14 సంవత్సరాల బాలికకు వివాహం చేసేందుకు జరుగుతున్న ఏర్పాట్లను ఐసీడీఎస్ అధికారులు,బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సీడీపీఓ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బంది, బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులు గ్రామానికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలపై వారికి అవగాహన కల్పించి వివాహాన్ని నిలిపివేశారు.ఈ సందర్భంగా సీడీపీఓ అనంతలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండకముందే వివాహం చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్యకు ఆటంకం కలగడంతో పాటు వారి





శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. బాలికల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాలు జరగకుండా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఎంఈఓ గిరి భగవాన్ దాస్ మాట్లాడుతూ బాలికలు చదువును కొనసాగించి ఉన్నత స్థాయికి ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల బాలికల భవిష్యత్తు దెబ్బతింటుందని, బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ, గ్రామ, మండల బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/26/A3646 .. Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.